వంశధార నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలి

- నిబద్ధతతో వంశధార ప్రాజెక్టును పూర్తి చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-హిరమండలం : శ్రీకాకుళం జిల్లాలో 19 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న వంశధార రిజర్వాయర్ నిర్మాణానికి దాదాపు 30 గ్రామాల ప్రజలు తమ భూములు, ఇళ్లను కోల్పోయి ప్రాజెక్టు కోసం వారి చేసిన త్యాగం మరువలేనిదని, వంశధార నిర్వాసితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా మంగళవారం హిరమండలంలోని వంశధార ప్రాజెక్టులను రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ ప్రతినిధి బృందం నిర్మాణ పనులను పరిశీలించారు. వంశధార ఎడమ కాలువ, కుడి కాలువలను పరిశీలించి ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ 2005 ప్రారంభించిన వంశధార ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన రైతులకు పల్లం భూమి ఎకరాకు రూ.1.40లక్షలు, మెట్టు భూమికి రూ.1.20లక్షలు పరిహారంగా ఇచ్చారని ఆ తరువాత నిర్వాసితులు ఎన్నో పోరాటాలు చేస్తే అదనపు పరిహారంగా ఎకరాకు రూ.1లక్ష చెప్పున ఇచ్చారని, ఇంకా 25 శాతం మంది లబ్ధిదారులకు అదనపు పరిహారం అందలేదన్నారు. ఆ డబ్బులతో నిర్వాసితులకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. ఆనాడు రైతులుగా బ్రతికిన వారు నేడు కూలీలుగా బతకాల్సిన పరిస్థితి ఏర్పాడ్డదని వాపోయారు. ప్రాజెక్టు ప్రారంభం నాడు ప్రకటించిన పరిహారం కంటే ప్రాజెక్టు పూర్తి చేసే సమయానికి ఉన్న చట్టాలను అనుసరించి పరిహారం చెల్లించాలని, అందులోభాగంగా వంశధార నిర్వాసితులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ప్రతీ నిర్వాసితునికి అందించాలని డిమాండ్ చేశారు. గతంలో గ్రామాల్లో ఇళ్ల లేనివారికి భూమిలేనివారికి పరిహారం అందలేదని అలాంటి వారు ఎక్కడి వెళ్లి బతకాలని, మరొక్క సారి నిర్వాసిత గ్రామాల్లో సర్వే జరిపి, ప్రతీ నిర్వాసితునికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. 2005లో ప్రారంభమైన ప్రాజెక్టు పనులు 20ఏళ్లు కావస్తున్నప్పటికీ పూర్తికాకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళంలో పర్యటించినప్పుడు 2022 డిసెంబర్ నాటికి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని ఇచ్చిన మాట ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టులో కూడా పనులు చక చకా జరగడం లేదని, నిధుల కొరతతో కాంట్రాక్టర్లు కూడా పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని విమర్శించారు. వైఎస్ఆర్ హయాంలో ప్రారంభించిన ఈ ప్రాజెక్టును అయినా అధికారులు చెబుతున్నట్లు 93 శాతం పూర్తి అయిన ఈ ప్రాజెక్టును ఈ జూలై నాటికైనా పూర్తిచేస్తే ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేసిన ముఖ్యమంత్రిగా జగన్ నిలుస్తారని ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని హితవుపలికారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ఉద్దానం ప్రాంత వాసులకు తాగునీరు కల్పిస్తే, ఉద్దానం కిడ్నీ సమస్యకు కూడా పరిష్కారం దొరుకుతుందని ఆయన అన్నారు. సీపీఐ బృందం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు సందర్శించి విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి, ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. సీపీఐ బృందం లో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జెవీసత్యన్నారాయణ మూర్తి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు, అక్కినేని వనజ, జి. ఈశ్వరయ్య, దేగ ప్రభాకర్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పి. కామేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. విమలతోపాటు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చాపర సుందర్‌లాల్, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కె. మన్మధరావు, సీపీఐ జిల్లా నాయకులు చాపర వెంకటరమణ, ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, డీహెచ్ పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, విశాఖ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యన్నారాయణ, ఏపీ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు చిక్కాల గోవిందరావు, నిమ్మాడ కృష్ణమూర్తి, లక్కోజి శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు పట్టా ప్రభావతి, ఆరేళ్లమ్మ, పెద్దఎత్తున సీపీఐ శ్రేణులు, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం దంత గ్రామానికి చెందిన బొమ్మాళి రవి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఇదే గ్రామానికి చెందిన సూరపు గోవిందరావుపై ఎస్సీ ఎట్రాసిటి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఎస్‌కె. మహ్మద్ ఆలీ తెలిపారు. బొమ్మాళి రవి యేదాది క్రితం సూరపు గోవిందరావుకు రూ. 6వేలు అప్పుగా ఇవ్వగా గోవిందరావు పనులు నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటూ శివరాత్రి పండగ సందర్భంగా గ్రామానికి రాగా రవి తనకు అప్పుగా ఇచ్చిన డబ్బులు సోమవారం అడగగా వారి ఇద్దర మధ్య వాగ్వీవాధం జరగగా గ్రామస్థులు ఇద్దర్ని సర్దిచెప్పి అక్కడ నుంచి పంపించగా రాత్రి మూడు గంటల సమయంలో అందరి మధ్యలో నన్ను బాకీ అడిగి అవమానిస్తావా అంటూ రవి ఇంటికి వెళ్ళి కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడ్డాడని పిర్యాదులో పేర్కొన్నారు.

సర్ధార్ లచ్చన్నపై అనిశ్చిత వ్యాఖ్యలు తగదు

పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకుల ఫిర్యాదు

విశాలాంధ్ర-మందస : స్వాతంత్ర్య సమరయోధులు, బడుగల బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్ధార్ గౌతు లచ్చన్నపై అనిశ్చిత వ్యాఖ్యలు చేయడం సరైనా పద్ధతి కాదని మందస టీడీపీ నాయకులు మందస పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. మండలం బేతాళపురం గ్రామానికి చెందిన బత్తిన లక్ష్మణరావు సర్ధార్ గౌతు లచ్చన్ననను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో హేళనగా మాట్లాడిన తీరు అనేకమంది స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాల మనోభావాలు దెబ్బతీసే విధంగా, కించపరిచేలా ఆ వ్యాఖ్యాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కనుక భవిష్యత్‌లో ఇటువంటి వ్యాఖ్యాలు పునరావృతం కాకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు అందించిన వారిలో దుర్యోదన, లింగరాజు, రుద్రయ్య, భాస్కరరావు, మహేష్, కర్రయ్య, నవీన్, ధనుంజయ, లచ్చయ్య, శ్యామల, సుశీల, కృష్ణారావు, రాజశేఖర్, లక్ష్మణ్‌లు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి : ఎమ్మెల్యే



విశాలాంధ్ర-పాతపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని శాసన సభ్యురాలు వారి క్యాంపు కార్యాలయంలో ఉత్తరాంధ్ర శాసనమండలి ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలను గూర్చి, ఎమ్మెల్యే రెడ్డి శాంతి నియోజకవర్గ వై.ఎస్.ఆర్సీపీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ, నియోజకవర్గ వైకాపా శ్రేణులు ప్రతిఒక్కరూ ఈ ఎన్నికలపై దృష్టి పెట్టి, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి తరపున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయానికి కలిసికట్టుగా ప్రతిఒక్కరూ పనిచేయాలని రెడ్డి శాంతి తెలిపారు.

జెడ్పీటీసీ హర్షం

విశాలాంధ్ర-సోంపేట : వైకాపా సీనియర్ నేత నర్తు రామారావు యాదవ్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం పట్ల సోంపేట జెడ్పీటీసీ తడక యశోద హర్షం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అటు కాంగ్రెస్ పార్టీలోను, ఇటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోను ఎనలేని సేవలందించి పార్టీ పటిష్టతకు కృషి చేసిన నర్తు రామారావుకు ఎమ్మెల్సీ అవకాశం లభించడం ఎంతో హర్షనీయమని అన్నారు. అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జెడ్పీటిసి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విజయవాడ నుంచి ఇక్కడకు చేరుకున్న రామారావుకు పూలమాలలు వేసి స్వాగతం పలికారు.

ఎంజీఆర్ చేతులమీదుగా పుస్తకాలు అందజేత

విశాలాంధ్ర-పాతపట్నం : ఆదర్శ జూనియర్ కళాశాలలో శ్రీ శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ కాంపీటేటివ్ పుస్తకాలు ఉచితంగా విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సామాజిక వేత్త మామిడి గోవిందరావు చేతులమీదుగా అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంజీఆర్ మాట్లాడుతూ విద్యార్థులకి సమాజం మీద అవగాహన కల్పించి, విద్యార్థులకు ఏఅవసరం వచ్చినా తనను సంప్రదిస్తే తప్పకుండా నావంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో దేశం అభివృద్ధి చెందుతుందని, శ్రీ శ్రీ ఫౌండేషన్ విద్యార్థులు ఉన్నత ఎదుగుదల కోసం లక్ష్యంగా పనిచేస్తున్నారని వారి కోసం విలువైన పుస్తకాలను ఉచితంగా ఇస్తున్నందుకు వారిని అభినందిస్తున్నాను అని తెలిపారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ చిందు శ్రీకాంత్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ ఫౌండేషన్ ప్రశంస పత్రాలు అందజేసి విద్యార్థులకు ఆసక్తికలిగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి, స్కూల్ చైర్మన్ పి. ధనుంజయ్ రావు మరియుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి సహకరించండి

ఎంపీ రామ్మోహన్ నాయుడుతో కలిసి టీడీపీ నాయకులు డీఆర్ఎంకు వినతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : జాతీయ రహదారికి అనుకొని, కోటబొమ్మాళి, పోలాకి, సంతబొమ్మాళి, సారవకోట, నరసన్నపేట మండలాలకు చెందిన ప్రయాణీకులకు ఎంతో ఉపయోగపడుతున్న హరిశ్చంద్ర పురం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేసి ఈ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేయాలని శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి మంగళవారం హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైలజసత్యన్నారాయణ, మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, టెక్కలి నియోజకవర్గ తెలుగుయువత ఆర్గనైజర్ కార్యదర్శి కోట సంతోష్ (సుధీర్)లు విశాఖ పట్నం డీఆర్ఎం అనుప్‌కుమార్‌సత్పత్తికి వినతి పత్రం అందజేశారు. ఈ రైల్వేస్టేషన్ రాష్ట్రంలోనే జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఏకైక రైల్వేస్టేషన్ అని ఈ రైల్వేస్టేషన్ అభివృద్ధి చేస్తే రైల్వే సంస్థకు ఆదాయంతో పాటు నాలుగు మండలాలకు చెందిన ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. అలాగే ఎంపీ రామ్మోహన్ నాయుడు డీఆర్ఎంతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఉన్న దండుగోపాలపురం, కోటబొమ్మాళి ఆర్ఎస్, తిలారు, ఉర్లాం, పొందూరు రైల్వేస్టేషన్‌లు అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజర్ కమిటీ సభ్యులు సాసుమతు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్లపై అధికారులకు బెదిరింపులు మానుకోవాలి

విశాలాంధ్ర-పలాస : పోస్టల్ డైరెక్టరేట్ అదేశాల మేరకు పివోఎస్‌బి మహా మేళా ఈ నెల 20 నుంచి 24వరకు ప్రతి పోస్టాఫీసులో 50 ఖాతాలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆచరణకు సాధ్యం కాని అశాస్త్రీయమైన టార్గెట్‌లు చేయమనడం ఎంతవరకు సమంజసమని ఎన్ఎఫ్‌పిడి జీడిఎస్ ఉద్యోగుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.నందికేశవరావు ప్రశ్నించారు. ఈ విషయంపై ఇటీవల రాష్ట్ర సంఘ నాయకులు సర్కిల్ పోస్టు మాస్టర్ జనరల్ వారికి వినతిపత్రం అందించామని అన్నారు. దేశవ్యాప్తింగా అన్ని డివిజన్ల సూపరిటెండెంట్ ద్వారా రాష్ట్రాధికారులకు కూడా వినతిపత్రం అందజేయడం జరిగిందని అన్నారు. ఈ వేదింపులు ఉద్యోగుల పట్ల అపని యడల విజయవాడ సర్కిల్ ఛీప్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం ఎదుట రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తపాలా ఉద్యోగులు మార్చి 9న మహాధర్న చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ, అక్కుపల్లి, బ్రాహ్మణతర్లా, పూండి తపాలా ఉద్యోగులతో పాటు సంఘ నాయకులు ఎం.వేమన, తేనేశ్వరరావు, ప్రకాశరావు, రాజేష్, దుర్యోధన, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

సొమ్ములు అందక... చతికిలపడ్డ పనులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు తదితర భవనాలను నిర్మించే గుత్తేదారులకు ప్రభుత్వం నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో ఈ భవనాల నిర్మాణాలు చేపట్టిన గుత్తేదారులు అప్పులతో కొట్టుమిట్టాడుతున్నారు. కోటబొమ్మాళి మండలంలో ప్రభుత్వ ప్రాధాన్య పనులకు గతేడాది ఆగస్టులో ఒకసారి నిధులు విడుదల చేశారు. ఆ తర్వాత మళ్లీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదలకాలేదని గుత్తేదారులు వాపోతున్నారు. కొందరు గుత్తేదారులు తాము ఇక పనులు చేయలేమని ఆయా నిర్మాణాలను నిలిపివేసిన సంఘటనలు కూడా మండలం కొన్నిచోట్ల ఉన్నాయి. ఇప్పటివరకు చేసిన పనులకు కోట్లల్లో బిల్లుల పెండింగ్‌లో ఉన్నయాని పలువురు అధికారులు అంటున్నారు. ఆయా నిర్మాణాలకు సంబంధించిన అధికారులు ఎప్పటికప్పుడు వివరాలు పంపిస్తున్న ప్రభుత్వం నుంచి స్పందన ఉండటం లేదంటున్నారు. మరోపక్క భవన నిర్మాణాల కోసం ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. చేసిన పనులకు బిల్లులను సకాలంలో విడుదల చేయాలని కింది స్థాయి అధికారులు, గుత్తేదారులు కోరుతున్నారు.

పెద్ద కరగాములో దారుణ హత్య

భర్తను చంపించిన భార్య

విశాలాంధ్ర-నరసన్నపేట : మండలంలోని కరగాము పంచాయతీ పెద్ద కరగాము గ్రామంలో మంగళవారం దారుణ హత్య జరిగింది. గ్రామానికి చెందిన ఇర్రి చంద్రభూషణ్ను (35) అతని భార్య, భాగ్యలక్ష్మి, బావమరిది, శివ నారాయణ కలిసి హత్యకు పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు గ్రామంలో ఇర్రి చంద్రభూషణ్, తోట పాలెం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మికి 2010వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి మాధురి, లాస్య ఇద్దరు కుమార్తెలు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చంద్ర భూషణ్ మద్యానికి బానిస కావడంతో తరచుగా తన భార్య భాగ్యలక్ష్మి తో ఘర్షణ పడుతుంటాడన్నారు. గత మహాశివ రాత్రి సాయంత్రం ఈ దంపతుల మధ్య ఏర్పడిన ఘర్షణ కారణంగా, భాగ్యలక్ష్మి అన్నదమ్ముడైన శివ నారాయణకు ఫోన్‌చేసి పెద్దకర్గాము రప్పించిందని పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో ఉన్న చంద్రభూషన్ను ఆయన భార్య భాగ్యలక్ష్మి, బావమరిది శివ నారాయణ కలిసి కర్రలతో ప్రాణం పోయేంతవరకు చితకబాదారని అన్నారు. హత్య జరిగిన వివరాలను పోలీసులు తెలుసుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించగా ఇంట్లో స్టీల్ సామాన్లు చిందర వందరగా పడి ఉండడమే కాక, మృతుడు చంద్రభూషణ్ కు కొట్టిన కర్రలు ముక్కలుగా రక్తంతో ఉండటాన్ని క్లూస్ టీం పరిశీలించింది. ఇంద్రభూషణం మృతికి కారణమైన ఆయన భార్య భాగ్యలక్ష్మి, బామ్మర్ది శివ నారాయణను సీఐ, రాము అదుపులోకి తీసుకున్నారు. మృదేహాన్ని ఎస్సై, సింహాచలం పోస్టుమార్టంకు పంపించారు.

రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది : బిజెపి నేత నరసింహారావు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని బిజెపి నేత రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా పాలన సాగుతుందని విమర్శించారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో ఎన్నికైనప్పటికీ ప్రజాస్వామ్యం పట్ల పాలకులకు విశ్వాసం లేదన్నారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని, రాష్ట్రంలో కొత్త తరహా రాజకీయాలకు తెర లేపారన్నారు. కేరళ మినహా దక్షిణాది రాష్ట్రాల్లో ఏనాడూ ఇలాంటి పాలన చూడలేదన్నారు. ప్రతిపక్షాలను కట్టడి చేయాలన్న సంస్కృతి సరికాదన్నారు. 175 స్థానాలు గెలుస్తామని చెబుతూనే... వైసీపీ ప్రభుత్వం అభద్రతాభావంతోనే ఇలాంటి పోకడలకు పాల్పడుతున్నారని చెప్పారు. సామాజిక న్యాయానికి పెద్ద పీట అని చెప్పడం ప్రచార ఆర్భాటమే తప్ప, నిజమైన అధికారం ఒక కుటుంబం, ఒక సామాజిక వర్గం చేతిలో కేంద్రీకృతమైందన్నారు. బీసీలకు, మైనార్టీలకు నామమాత్ర పదవులతో సరిపెడుతున్నారన్నారు. వైసిపి, టిడిపిలతో సామాజిక సాధికారత సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో మూడు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బిజెపి పోటీ చేస్తున్నట్లు చెప్పారు.పివిఎన్ మాధవ్ తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాను సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, నియోజకవర్గ పార్టీ ఇంచార్జి నడుకుది ఈశ్వర రావు, మండల పార్టీ అధ్యక్షుడు సంపతిరావు నాగేశ్వరరావు, పార్టీ నేతలు తమ్మినేని గోవిందరావు, వజ్జిపర్తి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న జీవీఎల్

విశాలాంధ్ర-అరసవల్లి: ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని మంగళవారం బీజేపీ రాజ్యసభ సభ్యులు గుంటుపల్లి వెంకట లక్ష్మీ నరసింహారావు కుటుంబసమేతంగా దేవాలయంనకు విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు.వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఘనంగా స్వాగతం పలికారు తదుపరి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి శ్రీ స్వామి వారి జ్ఞాపికను ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా 1 టౌన్ ఎస్సై బలివాడ గణేష్, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీపీఈడీ డీపీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-ఎచ్చర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ కేంద్రంగా బీపీఈడి డిపిఈడి మూడవ సెమిస్టర్ మంగళవారం ప్రారంభమైంది ఈనెల 24వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల తీరును వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వాలంటీరుకు గాయాలు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మండలంలో మర్రిపాడు కె గ్రామ సచివాలయ పరిధిలో వాలంటరీగా విధులు నిర్వహిస్తున్న ప్రకాషరావు అనే వ్యక్తికి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే మంగళవారం ఉదయం మర్రిపాడు-కె నుంచి పాతపట్నం వైపు వెళుతుండగా మెళియాపుట్టి వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే హుటాహుటిన పాతపట్నం సిహెచ్సీ కి తరలించగా అక్కడ నుండి మెరుగైన వైద్యం అందించేందుకు శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై టి.రాజేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ వస్తువులతో ప్రజలకు కుచ్చుటోపీ

పేరుకు మాత్రమే బ్రాండ్... వస్తువులన్నీ నకిలీ..

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మధ్య తరగతి కుటుంబాలకు ఎటువెళ్లినా కొచ్చుటోపి పెడుతున్నారు కేటుగాళ్లు. నెలనెల కొంత డబ్బులు కడితే అరువు సామానులు ఇస్తామని కోటబొమ్మాళి మండలంలో పుట్టగొడుగుల వ్యాపారులు వెలుస్తున్నారు. ఎలక్ట్రికల్ వస్తువు అమ్మకాల నిర్వాకం మధ్యతరగతి కుటుంబాల అవసరాలపై వారి ఆర్థిక వ్యవస్థపై తెలుసుకొని మధ్యతరగతి కుటుంబాలకు నెలవారి కంతులుగా ఇస్తామంటూ విద్యుత్ ఇన్వటర్లు, వాల్ టీవీలు, ఫ్రిజ్లు, మిక్సీలు, ఎయిర్ కూలర్లను అన్ని కంపెనీ వస్తువులే ఇస్తామంటూ వారికి మాయ మాటలు చెప్పి నామమాత్రానికి పైన కంపెనీ పేర్లను ప్రచురించి హైదరాబాద్, బెంగళూరు, బొంబాయి నుంచి నకిలీ వస్తువులను తెప్పించుకొని వాటి కట్టాల్సిన ప్రభుత్వ పన్ను కట్టకుండా ప్రభుత్వానికే నామాలు పెడుతూ అటు అధికారులకు ముడుపులు చెల్లిస్తూ వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు తొమ్మిది కాయలుగా జరుపుకుంటూ ప్రజలను దోచుకుంటున్నారు. ఈ నకిలీ వ్యాపారస్తులు ఇదే మోసపూరిత వ్యాపారాన్ని పట్టణానికి ప్రజలకు కుచ్చుటోపి పెడుతున్నారు. ఇది చాలా మంచి కంపెనీ అని ఏం జరిగినా నేనున్నానని తేనెటీపలుకులు పలుకుతూ ఈ వస్తువులను వారికి కట్టబెడుతున్నారు. మూడు నాలుగు నెలలు గడవకనే ఇచ్చిన వస్తువులు మొరాయించటం, సమస్యపై వారికి నిలదీస్తే హై వోల్టేజ్ వచ్చిందనో లేక కరెంట్ వీక్‌గా ఉందనో ఏదో ఒక సాకు చెప్పడం మొదలెడతారు. కొద్దిరోజులు పాటు వారిచ్చిన వస్తువును తీసుకెళ్ళి వాటిలో ఉన్న వస్తువులన్నీ కాలిపోయాయని వాటి వస్తువుల దొరకడం చాలా కష్టమని అక్కడి నుంచి వస్తువులు రావడం ఆలస్యం అవుతుందని వాటికి బదులుగా మీరు ఇంకా కొంత డబ్బు చెల్లిస్తే పాత టీవీ బదులుగా కొత్తటీవీనే ఇస్తామని మరొకకుచ్చుటోపి పెట్టడం మొదలెడతారు. చెల్లించిన నెలకంతులపై స్టేట్మెంట్ కోరిన బిల్లు అడిగిన చివరికి ఆ వస్తువులపై వడ్డీ చెక్కర వడ్డీ అంటూ వారి ఇళ్ల దగ్గరికి వెళ్లి దౌర్జన్యంగా డబ్బు వసూలు చేస్తున్నారని వీరి దౌర్జన్యాలకు వీరి ఆగడాలకు హద్దు లేకుండా పోతుందని స్థానికులు పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు ఇలాంటి నకిలీ కేటుగాళ్లపై చర్యలు తీసుకోవాలని మధ్యతరగతి కుటుంబాలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుకున్నారు.

పోటో: 2. గ్రామాల్లో అరువు సామానులు అమ్ముతున్న వ్యాపారులు

సాగుభూములకు పట్టాలివ్వాలి

విశాలాంధ్ర-మందస : మండలం సాబకోట పంచాయతీ నువ్వాగాం, చిన్నరంగమటియా గ్రామాల్లో గిరిజనులు సాగులో ఉన్న భూములు గిరిజనులకే పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ధర్మారావులు అన్నారు. మంగళవారం గిరిజన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా జీడి, జొన్న, గంటిలు, కొరలు, సాగు చేస్తూ సుమారుగా 100 గిరిజన గ్రామాలు జీవిస్తున్నాయని, ఈ భూములకు గిరిజనేతరులు పట్టాలు చేసుకొని అక్రమించుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా వారు దళారులకు కొమ్ముకాస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గిరిజనుల సాగులోఉన్న భూములను పరిశీలించి వారికే పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.గురునాద్, ధర్మారావు, గోవర్ధన్, భాస్కరరావులు పాల్గొన్నారు.

గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి హేయమైనది

- ఓటమి భయంతోనే వంశీ వర్గీయుల దాడులు
- టీడీపీ యువ నాయకులు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : టీడీపీ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని, వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని రావణకాష్టంలా మారుస్తున్నారని టీడీపీ యువ నాయకులు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ వైసీపీ ఉన్మాదులు దాడులు చేయడం తగదని అన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడులకు దిగుతున్నారని ఇలాంటి దుందుడుకు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం వైసీపీ దిగజారుడు తనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వైసీపీ రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని చెప్పారు.

యువత చేతుల్లోనే తెలుగు భవిత

మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.శ్రీరాములు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : మాతృభాషను బతికిస్తూ, ఆంగ్ల భాషను కూడా నేర్చుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు హితవు పలికారు. మంగళవారం ఉదయం కళాశాల సమావేశ మందిరంలో, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఆయన మాట్లాడారు. తెలుగు భాష భవిష్యత్తు యువతరం చేతుల్లోనే వుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగును బతికించడంలో సాహిత్యం గొప్ప పాత్ర పోషిస్తుందని, అరసం గత ఎనభై ఏళ్ల నుంచి నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు. విద్యార్థి, విద్యార్థులు సాహిత్య రంగంలోకి రావాలని కోరారు. చరిత్ర గల అరసం, ఇస్కఫ్ సంస్థలతో కలసి తమ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా వుందన్నారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు నల్లి ధర్మారావు మాటాడుతూ అంతరించి పోయే భాషల్లో తెలుగు ఒకటని హెచ్చరించినట్టు తెలిపారు. తెలుగు భాష ఉదారమైనదని, పర్షియన్, ఇంగ్లీష్ పదాలు చొరబడ్డాయని సోదాహరణంగా వివరించారు. ఇంటి భాషగా, కుటుంబ భాషగా ముందు బ్రతికించాలని కోరారు. ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నర్సింహులు మాట్లాడుతూ మనభాష, మన సంస్కృతి సాంప్రదాయాలు మీద విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి అన్నారు. తెలుగు భాష ను వాడుక భాషగా చేసిన గిడుగు, శ్రీకాకుళం జిల్లా కే తలమానికం అయిన కారా మాస్టారు లాంటి ఎంతో మంది నీ ఆదర్శంగా చేసుకొని ప్రతీ విద్యార్థి వారి వారి ఇష్ట రంగాల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పర్యావరణం మీద కూడా అవగాహన కలిగి ఉండాలని, పర్యావరణ పరిరక్షణ కు ప్రతీ విద్యార్థి పాటుపడాలి అని కోరారు. మాతృభాషా దినోత్సవం సందర్భాన్ని విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి ఫ్రెడరిక్, తెలుగు విభాగం అధిపతి మరడాన శ్రీనివాసరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు ఎంవి మల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు బుడుమూరు శ్రీరామ్మూర్తి, జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఈశ్వరరావు, కూన పాపారావు, కళాశాల అధ్యాపకులు సిహెచ్ కృష్ణారావు, డాక్టర్ కె.గిరిజ, డాక్టర్ కె.జ్యోతి లక్ష్మి, ఎస్.పద్మావతి, ఎస్.రుద్రమరాణి తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేపల్లిలో పరవళ్ళు తొక్కిన పచ్చదండు

విశాలాంధ్ర-పొందూరు : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు పాలకులు తీరుపై పచ్చదండు తమ్ముళ్లు పరవళ్ళు తొక్కుతూ జగన్ సర్కార్ నిరంకుశ నిర్లక్ష్య వైఖరిని ప్రజల ముందు ఉంచి ప్రజా చైతన్యం తీసుకువస్తూ తనదైన శైలిలో తెలుగుదేశం తమ్ముళ్లు ఇదే మీ ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఘనంగా బొడ్డేపల్లి గ్రామంలో నిర్వహించారు. ఆముదాల వలస నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు కూన రవికుమార్ ఆధ్వర్యంలో సర్కారు వైఖరిపై ఫోటెత్తిన నినాదాలతో పురవీధుల్లో పసుపు జెండాలు చేతభూని సర్కారు అవలంభిస్తున్న తీరుపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసీపీ అవినీతి ఆగడాలు అంతం - తెలుగుదేశం పంతం, మనకు వద్దు బాబోయ్-రాక్షస పాలన, అక్రమ కుంభకోణాలకు హద్దే లేదు-ఏలే వాడికి బుద్దే లేదు, జగన్ రెడ్డి డౌన్ డౌన్ అనే బిగ్గరి నినాదాలతో హెరాఎత్తించారు. గ్రామంలో వీధి వీధిలోమాజీ ప్రభుత్వ విప్ కూన రవికుమార్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతన్నల పేరు చెప్పి ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్ రెడ్డి రైతుల నెత్తిపై భస్మాసుర హస్తం వేస్తున్నారని మండి పడ్డారు. రైతు కష్టించి పండించే గింజలను కొనుగోలు చేయటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో అన్నదాత ఉసురు తగిలి జగన్ వచ్చే ఎన్నికల్లో ఇంటికి తరమడం ఖాయమని విమర్శల వర్షం కురిపించారు. ప్రజలకు కంటితడి పెట్టించే సర్కారుకు పుట్టగతులు లేకుండా పోతుందని అన్నారు. సర్కారు అవినీతి అంతం చేసేంతవరకు కార్యకర్తలు రాష్ట్రంలో తెలుగుదేశం గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు , జిల్లా తెలుగునాడు ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు గారు నారాయణరావు,జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శిబలగ శంకర్ భాస్కర్, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నెంబర్ ఫోర్ ఎంపీటీసీ ప్రతినిధి బడాన శేషగిరి నాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సభ్యులు చింతాడ వెంకట వాసుదేవరావు, మండల నలుమూలల నుండి కదిలి వచ్చిన ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : మాతృభాషలోని గొప్పతనాన్ని గుర్తించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన ప్రక్రియ తెలుగు భాష విశిష్టతను, ఔన్నత్యాన్ని చాటుతుందన్నారు. విద్యార్థులు భాషపట్ల అభివృద్ధి పెంచుకోవాలన్నారు ప్రముఖ అవధాని డాక్టర్ మీగడ రామలింగస్వామి ఆధ్వర్యంలో సంగీత నవావధానం జరిగింది. రామలింగస్వామి తనదైన శైలిలో గయోపాఖ్యానం, పాండవ విజయాలు, సత్యహరిచంద్ర నాటకాల్లోని పద్యాలను వినిపించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ సిహెచ్ ఏ రాజేంద్రప్రసాద్, వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, వర్సిటీ తెలుగు విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ కె ఉదయ్ కిరణ్, అధ్యాపకులు డాక్టర్ యూ శాంతి, బలరాం నాయుడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జాయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో...

అరసవల్లిలో : మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను జాయ్ కిడ్స్ ఇంటర్నేషనల్ ప్లేస్కూల్‌లో స్కూల్ కరస్పాండెంట్ జామి స్రవంతి కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి కిరణ్ మాట్లాడుతూ మాతృభాషలో విద్యాబోధనతో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందని, మాతృ భాష తెలుగు కమ్మనైనదన్నారు. అంతర్జాతీయ మాతభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్కూల్‌లో చిన్నారులతో తెలుగు తల్లి నత్య ప్రదర్శన నిర్వహించారు. తెలుగుతల్లి చిత్రం, వ్యాస రచన, క్విజ్, వక్తత్వ పోటీలు నిర్వహించారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది. పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో : కాశీబుగ్గ సాయికాలనీ ప్రభుత్వ పాఠశాలలో జనజాగృతి ఆధ్వర్యంలో మంగళవారం వేడుకులను ఘనంగా నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.ఈశ్వరరావు, బమ్మిడి సుబ్బారావు, తెప్పల కృష్ణమూర్తి, బండారి కాళిదాసు, బత్తిని బాలక్రిష్ణ, నెమలిపురి అప్పారావు, కె.భావన్నారాయణరెడ్డి, జయంతి గజలక్ష్మి, టి.బాబూరావు, డి.జయరాం, చెల్లూరు శంకరరావులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో : దండుగోపాలపురము జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవము ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పి.జానకిరామయ్య తెలుగుతల్లి చిత్రపటానికి, రాధాకృష్ణన్, గాంధీ, అబ్దుల్ కలాం, వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ప్రధానోపాధ్యాయులు జానకిరామయ్య మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17న యునెస్కో ప్రకటించిందని, 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారని అన్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోందని వివరించారు. మాతృభాష మనకు తల్లి వంటిదని, దానిని ఎన్నడు విస్మరించరాదని ఉద్బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన, సుమతి శతకములలో పద్యాల పోటీ, సమకాలీన సమాజంలో మాతృభాష ఆవశ్యకత అనే అంశము పైవ్యాసరచన,దేశభక్తిగీతాలు పోటీలు, తెలుగు ఉపాధ్యాయులు ఎం.రాము, పి.అప్పలరాజులు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులను అ అక్షర ఆకృతిలో కూర్చుండబెట్టి విద్యార్థులలో మాతృభాష పట్ల అభిమానము పెంపొదింపచేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యా యులు టి. భాస్కరరావు, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మీకాంతం, భవాని, లక్ష్మి, చంద్రశేఖర్, సూర్యకాంతం, సునీత, పార్వతి, అరుణశ్రీ, ఉమ, చిన్నారావు, మార్కండేయులు, సిఆర్‌పి గిరి, రోజా, దయాసాగర్, శివ, పాటశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కవిటిలో : మండలంలోని బి.గొనప పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులకు జాతీయ గీతం పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఖగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, మాతృభాష యొక్క విశిష్టత తెలియపరచాలని ఉద్దేశంతో జాతీయగీతం పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో : మాతృత్వంతో భాష ముడిపడి ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురుస్కరించుకుని మంగళవారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు భాష పట్ల అవగాహన కల్పించారు. భావాలు సులువుగా పంచుకోవడానికి మాతృ భాష ప్రథమ మాతృక అని అన్నారు. భాష-లిపి వాటిలో ఔనత్యాన్ని తెలుసుకుని పరిరక్షణకు ప్రతీ ఒక్కరు ఎల్లప్పుడు కృషి చేయాలని కోరారు. మాతృ భాషలోని మాధుర్యంతో ఎందరో మహానుభావులు చేసిన రచనలు నేటి తరాలకు మార్గదర్శకాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృంధం సుశాంత్ జెన్నా, రామక్రిష్ణ, సంతోష్‌కుమార్, ఆర్కే త్రిపాఠి, లోకేశ్వర రావులు పాల్గొన్నారు.

శాంతినికేతన్ పాఠశాల ఆవరణలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దక్కత క్రిష్ణమూర్తి మాట్లాడుతు గర్భస్థ శిశువులకు మాతృ భాష సంకేతాలు అందుతుంటాయని శాస్త్రలు వెల్లడించాయిని అన్నారు. మాతృ భాషతో ప్రారంభించి, ఇతర జాతీయ అంతర్జాతీయ భాషలు నేర్చుకోవడంతో విద్యార్థి జీవితం ఒడిదుడుకులు లేకుండా సాగుతుందని, మాతృభాషకు మరే భాష సాటి రాదని అన్నారు. మాతృభాష మాట్లాడలేని పిల్లల్లో చురుకుదనం తక్కువగా ఉంటుందని అన్నారు. మాతృభాషను క్షుణ్ణంగా నేర్పడానికి తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంటరాక్ట్ క్లబ్ కోఆర్డినేటర్ కె.సి పూరీ, అధ్యాపకులు సురేఖ, పద్మజ, శ్రీధర్, శంకర్, ఇంటరాక్ట్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు త్రిష, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్తు రామారావుకు మంత్రి ధర్మాన అభినందన

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : స్థానిక సంస్థల కోటాలో త్వరలో శాసన మండలికి వెళ్లనున్న నర్తు రామారావును రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అభినందించారు. ఆత్మీయ సత్కారం అందించారు. క్యాంప్ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో భాగంగా మంత్రి ధర్మాన మీడియాతో మాట్లాడుతూ నర్తు రామారావు చాలా కాలం నుంచి ప్రజా జీవితంలో ఉన్నారని, యాదవ కులానికి చెందిన ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారన్నారు. గతంలో జగన్ ఇచ్చిన మాట ప్రకారం చట్ట సభల్లో వెనుకబడిన వర్గాలవారు సమస్యలు వినిపించు కునేందుకు అవకాశం ఇస్తానని అన్నారని, ఆ రోజు జగన్ ఇచ్చిన హామీ ప్రకారం ఇవాళ ఆయన ఎంపిక ఖరారు అయిందన్నారు. జిల్లాలో ఉన్న యాదవులంతా హృదయపూర్వకంగా జగన్ కు కృతజ్ఞతలు తెలియజేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో జనాభాకు తగ్గట్టుగా వారి వారి రాజకీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా వారందరికీ నేడు అవకాశాలు ఇస్తున్నారు. 75 ఏళ్లుగా ఈ విధంగా ఎన్నడూ జరగలేదని, రాజకీయ అధికారం కోసం ఆరాట పడుతున్న సామాజిక వర్గాలకు తగు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. తమ కులానికి చెందిన సమస్యలు చెప్పాలన్న ఆవేదనతో ఉన్నవారికి ఇవాళ సంబంధిత వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా వారి కల ఫలించిందన్నారు. ఆ విధంగా ఎన్నో ఏళ్ల కల ఫలించిందన్నారు. అట్టడుగు వర్గాలు రాజకీయ అధికారం దక్కేందుకు జగన్ తీసుకున్న నిర్ణయం ద్వారా మార్గం సుగమం అయిందన్నారు. తమకు తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్న ఆవేదన వారిలో ఉందన్నారు. అదేవిధంగా ఎన్నో అవమానాలకు గురైన సామాజిక వర్గాలు ఇప్పుడు చట్ట సభల్లో మాట్లాడే అవకాశం దక్కిందన్నారు. కానీ ఇప్పుడు జగన్ నిర్ణయం కారణంగా అటువంటి పరిస్థితులు లేవని, రామారావు సమర్థంగా పనిచేసి మంచి పేరు తీసుకు రావాలని భావిస్తున్నారన్నారు. ఈ నెల 22 వ తారీఖు మధ్యాహ్నం రెండు గంటలకు నామినేషన్ వేయనున్నారని, ఆయన నామినేషన్ వేసేందుకు చేపట్టే ప్రక్రియకు అంతా తరలి రావాలని కోరుతున్నామన్నారు.

అనంతరం నర్తు రామారావు మాట్లాడుతూ నా నాయకత్వానికి తగిన గుర్తింపు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఆ రోజు వైఎస్ నాకొక అవకాశం ఇచ్చారని, ఇప్పుడు ఆయన తనయుడు అవకాశం ఇచ్చారన్నారు. యాదవులను ఏకతాటిపై తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. వైసీపీ బలోపేతానికి పనిచేసి మళ్లీ సీఎం జగన్ అయ్యే విధంగా పనిచేస్తానన్నారు.

గల్ఫ్ కార్మికుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-సోంపేట : ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకుని విదేశాలకు వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన ఈమండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన ఓ కార్మికుడు కుటుంబానికి గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న స్థానికులు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. మామిడి పల్లి గ్రామం బిసి కాలనీకి చెందిన కొరిబిల్లి ధర్మారావు ఘనా దేశంలో అనారోగ్యానికి గురై అక్కడేమృతి చెందిన విషయం తెల్సిందే. కుటుంబాన్ని పోషించాల్సిన వ్యక్తి మృతి చెందడంతో నిస్సహాయులైన ఆ కుటుంబానికి ఆ దేశంలో పని చేస్తున్న మన ప్రాంత కార్మికులు సేవా దృక్పదంతో చందాలు వేసుకుంటూ ధర్మారావు కుటుంబానికి మంగళవారం 72500 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. వారి సహాయం పట్ల మామిడిపల్లికి చెందిన మహాత్మాగాంధీ యూత్ సభ్యులు, సర్పంచ్, ఎంపిటిసి తదితరులు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

మహిమాన్వితుడు చక్రధర స్వామి

- నిత్యం ఆధ్యాత్మిక శోభతో పెరుమాళ్ ఆలయం.
- శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ చక్ర పెరుమాళ్ ఆలయం.
- నేటి నుండి అట్టహాసంగా స్వామి వారి డోలోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-కవిటి : ఉద్దానప్రాంత భక్తులు ఆరాధ్యదైవంగా కొలుస్తున్న బెజ్జిపుట్టుగలో శ్రీదేవి భూదేవి సమేత చక్ర పెరుమాళ్ళ స్వామి వారి డోలోత్సవాలు నేటితో ప్రారంభం కానున్నాయి.ఫాల్గుణ శుద్ధ తదియ 22వ తేదీ (బుధవారం) మొదలుకొని ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి మార్చి 7వ తేదీ(మంగళ వారం) వరకు అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. 8వ తేదీ (బుధవారం) న స్వామివారి డోలోత్సవం నిర్వహించి పదిహేను రోజులపాటు డోలోత్సవాలు నిర్వ హిస్తుంటారు. ఈ ఉత్సవాలు గ్రామం ఇతర గ్రామాల వారి సహకారంతో హరికథలు, గరుడ సేవలు, స్వామివారి పల్లకి ఉత్సవం, ప్రత్యేక పూజలు, బ్రహ్మోత్స వాలు నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలతోపాటు, ఒరిస్సా, జిల్లా స్థాయిలో పర్యాటకులు సందర్శిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సంగీత, కళలు చేపట్టి భక్తులు శ్రీవారి సేవలో తరిస్తారు.

- కామ దహనం, డోలారోహణం... పౌర్ణమి నాటికి స్వామి వారి ఉత్సవాలు అత్యంత శోభాయమానంగా వెల్లివిరుస్తాయి. ఆ మరునాడు వేకువజామున దేవుడు మాన్యం సమీపంలో కామ దహన కార్యక్రమం నిర్వహిస్తారు.ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు తరలి వస్తారు. శ్రీవారి కథాగానం,కీర్తి ప్రతిష్టలను పఠించి ఉత్సవాలు ముగిస్తామని ఆలయ ధర్మకర్తలు పొందల కృష్ణారావు, పీ. వీ.ఎస్ రాంబాబు, పొందల విజయ్ కృష్ణ తెలిపారు.

- స్వామివారి చరిత్ర... సుమారు మూడు శతాబ్దాల క్రితం బ్రిటిష్ వారి పాలనా కాలంలో తూర్పు తీరమమైన బంగాళాఖాతంలో డచ్ వారి నౌకా ప్రయాణం బెజ్జి పుట్టుగ గ్రామ సమీపంలో హఠాత్తుగా

నౌక నిలిచిపోయింది. నౌక నిర్మాణం అంతా సవ్యంగా ఉన్నప్పటికీ ముందుకు కదలలేదు అందులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చక్ర ధర స్వామివారి పంచలోహ విగ్రహాలు ఉన్నాయి. విషయం తెలుసుకున్న బెజ్జిపుట్టుగ కలింగ వైష్ణవులు నౌక లోంచి శ్రీదేవి , భూదేవి,సమేత శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామివారి విగ్రహాలను బయటకు తీసి బెజ్జి పుట్టుగ గ్రామంలో పూరిపాకలో ప్రతిష్ట చేశారు. వెంటనే నౌక ముందుకు కదిలిందని స్థానికులు చెబుతుంటారు.

- స్వామివారి లీల... అలా బెజ్జి పుట్టుగ లో పూరిపాకలో ప్రతిష్ఠించిన స్వామివారిని బెజ్జిపుట్టుగ కు చెందిన ఈనామీ దారులైన ఇచ్ఛాపురం వాసి గాదె పంతులు స్వామివారిని తన స్వగృహానికి తీసుకువెళ్లి వైష్ణవ సాంప్రదాయం ప్రకారం భోగ రాగాలు నిర్వహిస్తుండగా ఇల్లంతా రక్త వర్ణం, వారు తిన్న తిండి కూడా రక్త వర్ణంగా మారిపోయింది.దాంతో భయభ్రాంతులైన పంతులుగారు మేము స్వామివారిని భోగ రాగాలు నిర్వహించలేమని మరల బెజ్జిపుట్టుగలో స్వామివారిని విడిచి వెళ్లారు.

- రాతి కట్టడాలతో ఆలయ నిర్మాణం... అలా విడిచి వెళ్ళిన స్వామివారిని పొందల నాయుడు వంశీయులు ఈ విగ్రహాలను పునః విగ్రహ ప్రతిష్ట గావించారు.అనంతరం పొందల వంశీయులుచే ఆలయ నిర్మాణం గావించి అందులో విగ్రహ ప్రతిష్ట జరిపించారు.పురాతన కాలంలో సిమెంటును ఉపయోగించకుండా రాతి కట్టడాలతో శిల్పులతో చెక్కించబడిన రాతి తో ఆలయ గర్భ గుడి నుండి గరుడ స్తంభం వరకు ఆలయ నిర్మాణం చేశారు.అనంతరం ఆలయ ముందు భాగం మండపం నిర్మాణం కీశే. మాదిన సింహాద్రి ఆధ్వర్యంలో1955వ సంవత్సరంలో ఆలయ నిర్మాణం పూర్తిచేసుకొని చక్ర పెరుమాళ్ళ స్వామి ఆలయం ఓ అద్భుత పుణ్యక్షేత్రంగా వెలసింది.

- కళాక్షేత్రం, ధృవ మూర్తులు, ధ్వజస్తంభం ఏర్పాటు... కళాక్షేత్రం పునర్నిర్మాణం చేపట్టారు.అలాగే ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులు, దాతల సహకారంతో ధృవ మూర్తులు, యాగశాల, ధ్వజ స్తంభం ఏర్పాటుచేసి 2022వ సంవత్సరం ఫిబ్రవరి 19వ తేదీన గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు.

- ప్రధమ బ్రహ్మోత్సవాలు... మార్చి 2వ తేదీ నుండి 6వ తేదీ వరకు శ్రీమన్నారాయణ సుదర్శన పెరుమాళ్ స్వామివారి బ్రహ్మోత్సవ ప్రథమ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వాములు ఆధ్వర్యంలో ఆలయ విగ్రహ ప్రతిష్టాపకులు శ్రీమాన్ ముప్పిరాల నారాయణమూర్తి స్వామి వారికి ఐదు రోజులపాటు వైదిక కార్యక్రమాలు నిర్వహించబడునని ధర్మకర్తలు తెలిపారు.

మళ్ళీ జగనన్నను చేద్దాం

- గృహ సారథులకు శిక్షణ సందర్భంగా కృష్ణదాస్
- ఆకలితో ఇంటికి చేరిన గృహ సారధిలు, మహిళలు

విశాలాంధ్ర-పోలాకి : ప్రజా సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు విరివిగా ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేద్దామని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం పోలాకి మండల పరిధిలో గల చల్లబంద జేసిఎస్ కల్యాణ మండపంలో జరిగిన సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో శిక్షణా కార్యక్రమాన్ని కృష్ణదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజలకు వైఎస్ఆర్సిపి కు మధ్య వారధిగా గృహ సారథులు సైనికుల్లా పని చేయాలనీ, వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డి గెలుపునకు వారు కృషి చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. శాసనమండలి సభ్యుల ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సామాజిక సమతూకాన్ని మరోసారి పాటించి, నర్తు రామారావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం వల్ల యాదవ సామాజిక వర్గానికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లయిందని వివరించారు. సమావేశం ముగిసినప్పటికీ భోజన సమయం కావడంతో కొంతమంది గృహసారథులు మహిళలు ఆకలితో నిట్టూర్పుగా వెనుతిరిగారు.

పాదయాత్ర కాదు టీడీపీ పాడి యాత్ర : కృష్ణ చైతన్య

రాష్ట్రంలో చంద్రబాబు తనయుడు లోకేష్ చేస్తున్న పాదయాత్ర టీడీపీ పాడి యాత్రగా మారిందని యువ నాయకులు, పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. గృహ సారథులు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు కావాలన్న ప్రతీ ఇంటికి 'నువ్వే మా నమ్మకం జగన్ 'అని ఉన్న స్టిక్కర్ అతికించాలని, పథకాలు వద్దనే వారి నుంచి లిఖితపూర్వక వినతి తీసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా జగనన్న సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంటే కావాలనే దుష్ప్రచారం చేసే వారి నుంచి పథకాలు వద్దనే హామీ తీసుకోవడంలో తప్పేమీలేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో డీసీసీబీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు ముద్దాడ బైరాగి నాయుడు, కణితి కృష్ణారావు, చింతాడ ఉమా మహేశ్వరరావు, చింతాడ వెంకట రావు, ముద్దాడ మురళీ నాయుడు, కోట అప్పారావు, కలగదండు పాపారావు, కణితి సత్తి బాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు భావన వైకుంఠరావు తులే పైడమ్మా రాయల మల్లేశ్వరరావు సర్పంచ్ ప్రతినిధి లు మజ్జి లక్ష్మినారాయణ యారాబాటి వెంకటరమణ బెండి శ్రీనివాసరావు పలు గ్రామ పంచాయతీల గృహ సారథులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చక్రతీర్థ స్నానాలు

విశాలాంధ్ర-పాతపట్నం : పాతపట్నంలో ఘనంగా నిర్వహించిన చక్రతీర్థ స్నానాలు శనివారం మహాశివరాత్రి ముగింపు సందర్భంగా నేడు మంగళవారం శ్రీ నీలకంఠేశ్వర, శ్రీ కేదారేశ్వర స్వామి వారి చక్రతీర్థ స్నానాలను ఆలయ అర్చకులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాలయ ఉత్సహ విగ్రహాలను భక్తుల సందర్శనార్థం పాతపట్నం పురవీధుల్లో పల్లకిలో మోస్తూ ఊరేగించారు. అనంతరం మహేంద్రతనయ నదిలో స్వామి వారికి చక్రతీర్థ స్నానాలను నిర్వహించారు. పాతపట్నం పరిసర ప్రాంతాల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహేంద్ర తనయా నదిలో చక్రతీర్థ స్నానాలు చేసి ఆలయాల్లోని మహాశివున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి,తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బూర్జలో : మండలము కొరికాన కూర్మరాజపురం గ్రామములో వెలిసిన లార్డ్ ఉమా ధరాంభికేశ్వర స్వామి వారి ఆలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న మహా శివరాత్రి వేడుకలు మంగళ వారము ఉదయము జరిగిన చక్ర తీర్థస్నానముతో ముగిసాయి. ఇదే గ్రామానికి చెందిన కొరికాన జగన్ మోహన్, నాగమణి దంపతులు శివ రాత్రి వేడుకలు వేద పండితులు అంపోలు కేశవ శర్మ, ఆలయ అర్చకులు వి.నందికేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 114 సంవత్సరాలకు ఒక్క సారి ఇలాంటి పుణ్య మైన రోజు శివరాత్రి పడినందున భక్తులు అదికసంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. ఈ నెల 18న మహాశివ రాత్రి రోజు మహా లింగోద్భవ ఘట్టము అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్న కురిమిపేట భజన భక్తమండలి వారిచే ప్రతి రోజు భజన కార్యక్రమాలు నిర్వహించారు. 20న అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడము జరిగింది. చివరిరోజు మంగళవారం చక్ర తీర్థస్నానము నిర్వహించి దేవుని ఊరిగేంపు నిర్విహించారు.

స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షునిగా జోగినాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఉత్తరాంధ్ర జిల్లాల్లో అతిప్రతిష్టాత్మకమైన వాకర్స్ క్లబ్ గా పేరుగాంచిన నగరానికి చెందిన స్టార్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎన్నికున్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కౌన్సెలర్ 1 కూన వెంకటరమణ మూర్తి సారథ్యంలో ఎన్నికలు జరిగాయి. 2023-24 సంవత్సరానికి గాను నూతన కమిటీ అధ్యక్షుడిగా రెండవసారి శాసపు జోగినాయుడు, కార్యదర్శిగా గోలీ సంతోష్ కుమార్, ఉపాధ్యక్షునిగా సింహాద్రి వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీ గా డాక్టర్ జి.నారాయణ రావు, కోశాధికారిగా బి.దేవీప్రసాద్, గౌరవ అధ్యక్షునిగా జి.ఇందిరాప్రసాద్, డైరెక్టర్లుగా కూన వెంకట రమణ మూర్తి,రత్నాల వరప్రసాద్, బి.వి.రవిశంకర్, పి.జి.గుప్తా, ఎస్.సంజీవరావు, చలపాక సూర్యారావు, గొర్లె వాసుదేవరావు, పూన్న కామేశ్వరరావు, గురు ఆనందరావు, గుడ్ల జగ్గారావు, మెట్ట దనుంజయబట్లు, శాసపు అప్పలనాయుడు, బొడ్డేపల్లి ప్రసాదరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డ్రాప్ అవుట్ విద్యార్థులకు దూరవిద్యలో అడ్మిషన్లు

విశాలాంధ్ర-మెలియాపుట్టి : డ్రాప్‌అవుట్ విద్యార్థిని, విద్యార్థులకు ఏపిపిఓఎస్ఎస్ దూరవిద్య ద్వారా అడ్మిషన్లు నిర్వహించబడునని మెలియాపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతు వైకుంఠరావు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. పదవ తరగతి పాసై ఇంటర్మీడియట్లో చేరని విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ పొంది కళాశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వక కళాశాలకు హాజరుకాని వారు, కళాశాలలో చేరి మధ్యస్థంగా చదువు ఆపేసిన వారు, 60 శాతం కంటే తక్కువ హాజరు ఉన్న డ్రాప్‌అవుట్ విద్యార్థిని, విద్యార్థులు ఏపిపిఓఎస్ఎస్ దూర విద్య ద్వారా 21-2-2023 నుండి 27/2/2023వ తేదీ వరకు అడ్మిషన్లు పొందుటకు ఇంటర్మీడియట్ బోర్డు మరియు ఏపిపిఓఎస్ఎస్ దూరవిద్య వారు సంయుక్తంగా డ్రాప్స్ నివారణ చేసే ప్రక్రియలో భాగంగా ఈ అవకాశం కల్పించారన్నారు. డ్రాప్‌అవుట్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఎస్.డి.ఆర్.ఆర్.ఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు ఓ ప్రకటనలో తెలియజేశారు పూర్తి వివరాలు తెలుసుకోవాలనుకోనే వారు మెలియపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చి వివరాలు తెలుసుకోవచ్చున్నారు.

దాతృత్వం చాటిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-పాతపట్నం : మండల కేంద్రంలో ఈరోజు జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో మెళియాపుట్టి మండలం మర్రిపాడు-కె గ్రామ వాలంటీర్ మరియు సచివాలయ కన్వీనర్ వట్టికుల్ల. ప్రకాశరావు తన కాలు విరిగి పాతపట్నం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి లో చికిత్స చేసుకుంటున్న వార్త స్థానిక శాసన సభ్యురాలు రెడ్డి శాంతికి తెలిసిన తక్షణమే గవర్నమెంట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షత్రగాత్రుడు ప్రకాశరావు వద్దకు వచ్చి అతనిని పరామర్శించి, వైఎస్ఆర్సీపీ మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అతనికి భరోసానిచ్చారు. తరువాత ప్రకాశరావు ఆరోగ్యపరిస్థితి వివరాలను ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్షతగాత్రునికి మెరుగైన వైద్యం అందించుట కొరకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి తన స్వంత వాహనంపై ప్రకాశరావును శ్రీకాకుళం పంపించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి దాతృత్వానికి పలువురు అభినందించారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి

విశాలాంధ్ర-సోంపేట : భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస జయంతి కార్యక్రమం మంగళవారం సోంపేట శ్రీశయనవీధిలోగల రామకృష్ణ ప్రార్ధనా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి అనంతరం రామకృష్ణ, శారదామాత, వివేకానందల చిత్రపటాలతో పురవీధుల్లో ఊరేగించారు. ప్రార్ధనా మందిరంలో భగవద్గీత పారాయణం, భక్తి గీతాలాపన జరిగింది. రామకృష్ణుని జీవిత ఘట్టాలను గూర్చి వక్తలు వివరించారు. రామకృష్ణ ప్రభ రాతపరీక్షలు ప్రతిభ చూపిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గరుడాచలం శంకరరావు, మందపాటి అప్పారావు, వుల్ల మీనకేతనరావు, జెర్రి తిరుపతి, రాఘవపాత్రో, మలిపెద్ది వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట : లక్ష్మినర్సుపేట ప్రాధమిక పాఠశాలందు అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంను (ఫిబ్రవరి -21) లయన్స్‌క్లబ్ సర్వీస్ చైర్ పర్సన్, దివ్యాంగ ఉద్యోగ సంఘ నాయుకుడు,ఉత్తమ ఉపాధ్యా యుడు లయన్స్ డా॥ఎం.కె మిశ్రో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడమైనది. ఈసందర్భంగా డా॥మిశ్రో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృభాష పరి రక్షణ కొరకు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా మాతృభాషా పరిరక్షణలో కీలక పాత్ర వహిస్తున్న ఉపాధ్యాయుడు మరియు అంగన్వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమం నందు ప్రధానోపాధ్యాయులు జి.ఎం పాత్రో, ఉమెన్ వెల్ఫేర్ సెక్రటరీ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు టి.ఉపేంద్ర, అంగన్‌వాడీ టీచర్లు ఆరుద్ర, విజయలక్ష్మి, సంగీత,గ్రామ వాలంటీరు తిరుపతి పాణిగ్రాహి, విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే మంచి ఫలితాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస : విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా వాటిని అధిగమించే స్థితిలో ఉంటే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని డైట్ లెక్చరర్ అల్లు అప్పన్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పరీక్ష పర్వ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మానసిక ఒత్తిడిని అధిగమించే మెలకువలు స్థానిక లక్ష్మీ నగర్ పాఠశాల లో మంగళవారం విద్యార్థులకు వివరించారు. ఒత్తిడి లేకుండా సులభంగా పరీక్షలు రాయసే విధానంపై విద్యార్థులకు వివరించారు. పోటీ ప్రపంచంలో ఆ తత్వాన్ని అలవర్చుకొని పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. అందుకు అన్ని విషయాల పట్ల విద్యార్థులు అవగాహన ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. పాఠశాల హెచ్ఎం రమణమ్మ మాట్లాడుతూ అన్ని విషయాల పైన సమగ్రమైన అవగాహన ఉండాలని వివరించారు. ఆత్మస్థైర్యంతో సరళని తెలుసుకొని ఒత్తులను అధిగమించాలని వివరించారు. పరీక్షా సమయంలో ఎటువంటి మానసిక, శారీరక ఒత్తిడిలకు గురికాకుండా ఉండాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులతో భవిష్యత్ ప్రణాళికల రూపొందించుకోవాలని ఎంఈఓ రామారావు, డిప్యూటీ ఎంఈఓ పైడి కూర్మారావు లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలిలో బీజేపీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-టెక్కలి : టెక్కలిలో భాజపా నియోజకవర్గ కార్యాలయంను జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు చేతులు మీదుగా మంగళవారం ప్రారంభించారని ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జీ బూరే నరేంద్ర చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా మండల కేంద్రాల్లో బీ జె.పీ కార్యాలయాలు ప్రారంభించడం జరుగుతుందని, అందులో భాగంగా టెక్కలి కేంద్రంలో భాజపా కార్యాలయం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతి రావు, నియోజకవర్గ ఇంఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవి బాబ్జీ, జిల్లా ప్రధాన కార్యదర్శి గాంధీ, జిల్లా ఉపాధ్యక్షులు నడుపురి లక్ష్మీనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి లింగరాజు, టెక్కలి మండల ప్రధాన కార్యదర్శి శాసనపూరి శ్రీను, రాజకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శాంతిని కలిసిన వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధులు



విశాలాంధ్ర-కొత్తూరు : కొత్తూరు మండలం వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్..కో కన్వీనర్ లు గా ఇటీవల నియంపబడిన గెదల చిన్న బాబు, పతివాడ. సుదర్శన రావు విశాఖ సూరిబాబు లు మంగళవారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ని మర్యాద పూర్వకంగా కలిసారు, తమ మీద నమ్మకంతో పార్టీ మీడియా బాధ్యతలును అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారుసీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి ,సంక్షేమ పథకాలను ప్రజలు కు వివారిస్తామని ఈ సందర్భంగా మండల సోషల్ మీడియా కన్వీనర్ చిన్న బాబు అన్నారు. వీరితో పాటు కొత్తూరు పిఏసిఎస్ ఛైర్మన్ చింతాడా సూర్యనారాయణ ఉన్నారు.

గునభద్రలో ఘనంగా 78వ శివ జయంతి

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం గునభద్రలో స్థానిక ఓం శాంతి ఆశ్రయం ఆధ్వర్యంలో 78వ శివజయంతిని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారి పద్మ శివలింగాలకు పూజలు చేసి ఓం శాంతి జండా ను ఎగర వేశారు, జ్యోతులు వెలిగించి కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లెపల్లి వాణి ప్రతినిధి కల్లెపల్లి వైకుంఠ రావు, ఓం శాంతి మందిరం ప్రాతినిది గెదల లక్ష్మినారాయణ గ్రామంలో పలువురు మహిళలు పాల్గొన్నారు,